మహిళాశక్తి పథకంతో ప్రగతి సాధించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ, జూలై 5 (నమస్తే తెలంగాణ) : మహిళా శక్తి పథకంతో మహిళల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేయాలని, ఇందుకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, లీడ్ బ్యాంక్ మేనేజర్ సంయుక్తంగా మహిళాశక్తి పథకం కింద రుణాల మంజూరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఆర్డీఏ ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మైక్రో ఎంటర్ ప్రైజెస్ కింద 6,990 యూనిట్లు, పాడి పరిశ్రమ అభివృద్ధిలో 6వేల యూనిట్లు, గేదెలు, కోళ్ల పెంపకంలో 1200 పౌల్ట్రీ యూనిట్లు, ఫుడ్ ప్రాసెస్‌లో 100 యూనిట్లు మంజూరుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి లబ్ధిదారులను గుర్తించాలని చెప్పారు. పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉన్నందున గేదెల మంజూరులో శ్రద్ధ తీసుకోవాలన్నారు. మార్కెట్లో నాటు కోళ్లకు మంచి డిమాండ్ ఉందని, కోడి పిల్లల తయారీ యూనిట్లను ఎంపిక చేసుకోవాలన్నారు. రుణం పొందేవారు మహిళాశక్తి సంఘంలో సభ్యురాలు అయితే చాలు అని బ్యాంకు రుణాలు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు. మహిళలతో యూనిఫామ్ కుట్టించేందుకు 52 యూనిట్లను ఏర్పాటు చేశామని వివరించారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు 125 రకాల యూనిట్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. డీఆర్డీవో మొగులప్ప, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్, ఏపీడీ శ్రీనివాస్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం ఆందోళన

సీపీఎం నేతృత్వంలో మున్సిపల్ ఆఫీస్ ఎదుట నిరసన

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ, జూలై 5 (నమస్తే తెలంగాణ): మూడో విడుత ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న పేదల ఇళ్లకు ఇంటి నంబర్లు ఇవ్వడంతోపాటు వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడారు. పేదలు ఇండ్లు నిర్మించుకున్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సమస్యలను గుర్తించి వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలందరినీ సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. జిల్లా నాయకులు అహల్య, బూడిది గోపి, బొట్ల శ్రీనివాస్, ఎండీ దస్తగిరి, పాము కృష్ణమూర్తి, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ అధ్యక్షుడు కళ్యాణం లింగం, పట్టణ కమిటీ సభ్యులు బాల్నె వెంకట మల్లయ్య, పందిళ్ల కల్యాణి, పాము శ్రీకాంత్, ఎండీ గౌసియా, జయ, రజిత, సౌందర్య, నాజియా, భాగ్య, మణి, శాంత, ఉపేందర్, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

'సామాజిక సేవే జీవిత లక్ష్యం'

బచ్చన్నపేట, జూలై 5 : సామాజిక సేవే తన జీవిత లక్ష్యమని మండలంలోని కొన్నెకు చెందిన బీఆర్‌ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన గాల్ల పద్మమ్మ(70) అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. దహన సంస్కారాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ పేదలకు తన వంతు సాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా సేవ చేయాలన్నదే తన తపన అన్నారు. ఎంత సంపాదించమన్నది ముఖ్యం కాదని, ఎంత మందికి సాయం చేశామన్నదే ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో మల్ల సిద్ధిరాములు, చెవిటి సోమయ్య, రామయ్య, నాంపల్లి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జఫర్‌గఢ్, జూలై 5 : మండలంలోని కూనూరు శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. కూనూరు శివారులో ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.12,660 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎక్స్‌రే కోసం 'ప్రైవేట్'కు..

- సీహెచ్‌సీలో నిరుపయోగంగా ఎక్స్‌రే మిషన్
- బచ్చన్నపేటలో నెలల తరబడి అందని సేవలు
- ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్న రోగులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

బచ్చన్నపేటలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, టెక్నీషియన్ లేక వృథాగా ఎక్స్‌రే మిషన్

బచ్చన్నపేట, జూలై 5 : ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్)లో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మిషన్ ఆరు నెలలకు పైగా నిరుపయోగంగా ఉంది. ఫలితంగా రోగులకు మెరుగైన వైద్య సేవలందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనికితోడు దవాఖానలో టెక్నీషియన్ లేకపోవడంతో ఎక్స్‌రేమిషన్ మూలన పడిందని తెలిసింది. ఆరుగురు డాక్టర్లు, సరిపడ సంఖ్యలో వైద్య సిబ్బంది ఉన్నా టెక్నీషియన్ లేక ఎక్స్‌రే మిషన్ వృథాగా ఉంది. ప్రమాదాలకు గురైన వారికి ఎక్స్‌రే తీయాలంటే ఇబ్బందవుతోంది. రోగులు ఒంటి నొప్పులు, కాళ్ల నొప్పులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయాలంటే ఎక్స్‌రే అవసరం. దీని ఆధారంగా రోగుల సమస్యలను గుర్తించి వైద్యం అందించే అవకాశముంటుంది. మండల కేంద్రంలో పెద్దాసుపత్రి ఉన్నా ఎక్స్‌రే మిషన్ పని చేయకపోవడంతో రోగులు నానా పాట్లు పడుతున్నారు.

'ప్రైవేట్' వెళ్తుండడంతో ఆర్థిక భారం

ఎక్స్‌రే మిషన్ పనిచేయకపోవడంతో ప్రమాదాలకు గురైన వారు, ఒంటి నొప్పులతో బాధపడేవారు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఆర్థికంగా భారమైనప్పటికీ మెరుగైన వైద్యం కోసం అనేక మంది జనగామ, చేర్యాల పట్టణాలకు వెళ్తున్నారు. ఈ ఆసుపత్రిలో ఆరుగురు డాక్టర్స్, ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, కాంటిజెన్సీ, కాంట్రాక్టు సిబ్బంది కలిపి సుమారు 40 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి రోజు ఓపీతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల సాధారణ కాన్పులు చేయడంలో బచ్చన్నపేట ఆసుపత్రికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఆపరేషన్ థియేటర్‌కు ఇన్వర్టర్‌ను కూడా ఏర్పాటు చేశారు. మరోవైపు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం మెరుగుపరిస్తే దవాఖానకు మరింత మంది రోగులు వస్తారని పలువురు అభిప్రాయపడ్డారు.

ఎంఎన్‌వో లేక ఇబ్బందులు

లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఎక్స్‌రే మిషన్ వృథాగా ఉండడం రోగుల పాలిట శాపంలా మారింది. ఆరు నెలలుగా వృథాగా ఉంటున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో డిప్యుటేషన్‌పై వచ్చిన టెక్నీషియన్ ప్రస్తుతం లేకపోవడంతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. జనగామ నియోజకవర్గంలోనే పెద్ద దవాఖానగా ఉన్న బచ్చన్నపేట సీహెచ్‌సీలో ఎంఎన్‌వో లేకపోవడం శోచనీయం. వివిధ కారణాలతో గాయపడిన వారు దవాఖానకు వస్తే కుట్లు వేసేవారు లేరు. దీంతో ఆసుపత్రిలో పని చేస్తున్న స్వీపర్లతో అ పనులు చేయిస్తున్నారని సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా వైద్యాధికారులు స్పందించి వెంటనే టెక్నీషియన్‌ను నియమించాలని, ఎక్స్‌రే మిషన్‌ను అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు ఎంఎన్‌వోను నియమించి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

టెక్నీషియన్ వస్తే ఇబ్బందులు తొలుగుతయ్..

ఆస్పత్రిలో 24గంటలు వైద్యసేవలు అందిస్తున్నం. రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఇన్వర్టర్ కొనుగోలు చేశాం. ప్రసవాల్లో మంచి రికార్డు సాధించాం. ఎక్స్‌రే మిషన్ నిర్వహణ కోసం టెక్నీషియన్ కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపాం. టెక్నీషియన్ వస్తే రోగులకు ఎంతో ఉపయోగకంగా ఉంటుంది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే బాధ తప్పుతుంది. ఎంఎన్‌వో (డ్రెస్సర్‌ని) నియమించాలని ప్రతిపాదనలు పంపాం.

– శ్రీనివాస్, దవాఖాన సూపరింటెండెంట్

బచ్చన్నపేట ఠాణాలో బీజేవైఎం నాయకులు

జఫర్‌గఢ్ పోలీస్ స్టేషన్‌లో బీజేవైఎం నాయకులు

కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం

బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేశ్

బచ్చన్నపేట, జూలై 5 : ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తున్నదని బీజేవైఎం మండల అధ్యక్షుడు బంగారు మహేశ్ అన్నారు. హైదరాబాద్‌లో చేపట్టిన నిరుద్యోగుల ఆందోళనకు మండల నాయకులు వెళ్లకుండా శుక్రవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాటి ఎమర్జెన్సీని తిరిగి అమలు చేస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నదన్నారు. అక్రమ అరెస్టులకు బెదిరేది లేదని, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మంచాల రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కక్కెర్ల గణేశ్, నాయకులు కంటెం భాస్కర్, రాంబాబు, కిషన్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం నేతృత్వంలో వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు కోరుకొప్పుల నగేశ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలేదని ఆయన విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులకు ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు తిరుపతి, లింగస్వామి, సాయిరామ్, అరవింద్, నాగరాజు, సంతోష్‌రెడ్డి, లింగస్వామి, రాజు, నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నర్మెట, జూలై 5 : బైక్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కన్నెబోయినగూడెంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై శ్రీకాంత్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెబోయినగూడేనికి చెందిన బిచ్చాల ప్రమీల(50) గురువారం రాత్రి మహిళా సంఘం మీటింగ్‌కు వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా ఇదే గ్రామానికి చెందిన దిండిగాల గణేశ్ మోటార్ సైకిల్‌పై వేగంగా వస్తూ ఢీకొట్టాడు. దీంతో ప్రమీలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి భర్త సిద్ధయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ వినియోగదారులకు మరిన్ని సేవలు

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

సాంకేతిక పరకరాన్ని పరిశీలిస్తున్న సీఎండీ

రఘునాథపల్లి, జూలై 5: విద్యుత్ సరఫరాను మెరుగుపర్చడంతోపాటు వినియోగదారులకు మరిన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నిడిగొండ 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మానవ రహిత సాంకేతికతో కూడిన పరికరాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన పరిశీలించారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సబ్‌స్టేషన్‌లో సాంకేతిక మార్పులు తెస్తున్నామని చెప్పారు. మనిషి సహాయం లేకుండానే ఈ పరికరం ఆటోమెటిక్‌గా విద్యుత్ ఆన్ ఆఫ్ చేస్తుందన్నారు. తొలిసారిగా నిడిగొండ సబ్‌స్టేషన్‌లో అమర్చిన ఈ పరికరం ద్వారా సత్ఫలితాలు వస్తే అన్ని సబ్‌సబ్‌స్టేషన్లలో అమరుస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సీజీఎం (ఆపరేషన్) కిషన్, జీఎం(ఐటీ) శ్రీనివాస్, టెక్నికల్ డీఈ శ్రీధరాచారి, అనిల్‌కుమార్, వేణుకుమార్, లక్ష్మీనారాయణ, మనోహర్‌రెడ్డి, సత్యనారాయణ, రఘునాథపల్లి ఏఈ రాహుల్, వినయ్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ మండల కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల, జూలై 5 : మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకోగా ప్రమాణ స్వీకారం చేశారు. మండల నూతన అధ్యక్షుడిగా ఈదునూరి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బూత్కూరు అశోక్‌రెడ్డి, కోశాధికారిగా గోలి పెద ఉప్పల్‌రెడ్డి ఎన్నికయ్యారు. వీరితో లయన్స్‌క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చంద్రశేఖర ఆర్య ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సుధాకర్‌రెడ్డి, ఆర్‌సీ కలువల భాస్కర్‌రెడ్డి, జడ్‌సీ బజ్జూరి వేణుగోపాల్, లయన్స్‌క్లబ్ బాధ్యులు మర్రిపట్టాభిరాంరెడ్డి, ఆకవరం నర్సింహారెడ్డి , ఈదునూరి వీరారెడ్డి, పెద్దాపురం వెంకటేశ్వరశర్మ, గడ్డం సత్యనారాయణరెడ్డి, గోలి ఉప్పల్‌రెడ్డి పాల్గొన్నారు.

వసతి గృహాలకు వార్డెన్లను నియమించాలి

ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న చిరంజీవి

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 5 : ప్రభుత్వ వసతి గృహాలకు పర్మినెంట్ వార్డెన్లను నియమించాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి, మాలోత్ రోహిత్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు ఆర్డీవో డీఎస్ వెంకన్నకు వినతిపత్రం అందించారు. చిరంజీవి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, బాలికల వసతి గృహాలకు పర్మినెంట్ వార్డెన్‌లు లేక ఇన్‌చార్జిలతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హాస్టళ్లలో మెనూ పాటించడం లేదని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

డీ షారోన్ కల్యాణి

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 5 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శుక్రవారం తెలిపారు. మోడల్ స్కూల్‌కు చెందిన డీ షారోన్, తాటికొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన మామిడి కల్యాణి 2023-2024విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షల్లో 9.8 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారని హెచ్‌ఎం రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొమ్ము శ్రీకాంత్, హెచ్‌ఎం రాజేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పాలకుర్తిలో..

అంజలి పల్లవి

పాలకుర్తి : మండలంలోని మల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కునుసోత్ అంజలి, బానోత్ పల్లవి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం కుల్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలం నుంచి ఇద్దరు గిరిజన బాలికలకు అవకాశం లభించడంతో నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 5 : డివిజన్ కేంద్రంలోని మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో ఖాళీగా పోస్టులను ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసే కేర్ టేకర్, వార్డెన్ పోస్టులకు అభ్యర్థులు బీఈడీ పూర్తి చేసి ఉండాలన్నారు. అదనపు వంట మనిషి పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు 10వ తరగతి పాసై ఉండాలని సూచించారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పంపాలని కోరారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌లో అదనపు వంట మనిషి, నైట్ వాచ్ వుమెన్ పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పెషలాఫీసర్ స్వప్న తెలిపారు. గర్ల్స్ హాస్టల్‌లో ఇద్దరు మహిళా అదనపు వంట మనుషులు, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నందున ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తామన్నారు. అదనపు వంట మనిషి పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలని, నైట్ వాచ్ వుమెన్ 10 వతరగతి పాసై ఉండాలని స్వప్న తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 5 : మండల కేంద్రంలోని 16వ వార్డులో సైడ్ డ్రైనేజీ పనులను మాజీ ఎంపీటీసీ గన్ను నర్సింహులు శుక్రవారం ప్రారంభించారు. 15 ఏళ్లుగా మురికికాల్వ లేక ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో దీనిపై పత్రికల్లో వెలువడిన కథనాలకు ఆర్డీవో డీఎస్ వెంకన్న స్పందించారు. సుమారు 250 మీటర్ల సైడ్ డ్రైనేజీ ఏర్పాటుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.4 లక్షలు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ.2.50 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో శుక్రవారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునిగల రాజు, గట్టు ప్రశాంత్, రవి, సిరిగిరి శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న గన్ను నర్సింహులు

దేవరుప్పులలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ కుట్రలపై బీఆర్‌ఎస్ నిరసన

- తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూల్చేందుకు యత్నించడంపై ఆగ్రహం
- దేవరుప్పలలోని హైవేపై బీఆర్‌ఎస్ శ్రేణుల రాస్తారోకో

దేదేవరుప్పుల, జూలై 5: మండలంలోని కామారెడ్డిగూడెంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూల్చేసేందుకు కాంగ్రెస్ నేతలు కుట్రలకు పాల్పడడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. దీనికి నిరసనగా జనగామ-సూర్యాపేట హైవేపై శుక్రవారం పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టాయి. అంతకు ముందు బీఆర్‌ఎస్ నేతలు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరామిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల కుట్రలను ఎండగడుతూ జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూల్చాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారని ఆయన విమర్శించారు. విగ్రహాన్ని కూల్చితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

రాస్తారోకోతో రాకపోకలకు అంతరాయం కలిగించారనే కారణంతో బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి నేతృత్వంలో దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల ఎస్సైలు చెన్నకేశవులు, ప్రసన్న, శ్రవణ్ రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనంతోజు కృష్ణమూర్తి, డైరెక్టర్ జోగు సోమనర్సయ్య, మండల నాయకుడు గొడుగు మల్లికార్జున్ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు స్టేషన్ బెయిల్‌పై వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఇంటి మల్లారెడ్డి, పీఏసీఎస్ సభ్యుడు కొత్త జలేందర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా సభ్యుడు కారుపోతుల భిక్షపతి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మైదం జోగేష్, కుతాటి నర్సింహులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాచర్ల బాబు, కడవెండి గ్రామ అధ్యక్షుడు తాటిపల్లి మహేశ్, గడ్డం రాజు, వంగ అర్జున్, యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్, వీరాచారి, కొండాజీ, గోపాల్దాస్ మల్లేశ్, బానోత్ రాజన్న, గ్రామ అధ్యక్షులు మేకపోతుల నర్సింహులు, తిరుమలేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, KUNDURU RAMESH REDDY S/o CHENNA REDDY Age: 49 yrs, Occu: Agriculture, on behalf of my minor daughter KUNDURU LAXMI (New Name), previously called KUNDURU SRILAXMI (Old Name), age: 17 yrs (minor), R/o H.No. 2-219/1, Nehru Nagar, Madikonda, Kazipet, Warangal Dist-506142. T.S. India and solemnly declare.

WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో అనిల్‌కుమార్

పాలకుర్తి రూరల్, జూలై 5: మండల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్రే కీలకమని, ఇందుకోసం వారు చేసిన కృషి మరవలేనిదని జడ్పీ సీఈవో, ఇన్‌చార్జ్ డీపీవో అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మాంగళ్య గార్డెన్‌లో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఎంపీడీవో ఆవుల రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పాలకుర్తి మండల అభివృద్ధికి ఎంపీపీ, జడ్పీటీసీ అందించిన కృషి మరువలేనిదన్నారు. పదవులు శాశ్వతం కాదని, చేసిన సేవే గుర్తింపును ఇస్తాయన్నారు. పదవులు లేకున్నా ప్రజాసేవకు అంకితమవ్వాలని ఆయన సూచించారు. డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి మొగిలప్ప మాట్లాడుతూ ఎంపీపీ, జడ్పీటీసీలు పాలకుర్తి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్, ఎంపీవో రవి కుమార్, ఎంపీవో అంబాల మంజుల, డీఈఈలు ధర్మేందర్, ఎఫ్ఎల్ చారి, కే సంధ్య, ఏఈఈలు ప్రశాంతి, నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, అన్న వజ్జుల నర్సింహమూర్తి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు వీరమనేని యాకాంతారావు, మాటూరి యాకయ్య, ఎర్రబెల్లి రాఘవరావు,, దేవస్థాన మాజీ చైర్మన్ వీ రాంచంద్రయ్య శర్మ, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ సర్వర్‌ఖాన్ పాల్గొన్నారు.

చిల్పూరు స్పెషల్ ఆఫీసర్‌గా విజయ్‌కుమార్

చిల్పూరు, జూలై 5 : మైనింగ్ ఏడీ డాక్టర్ జీ విజయ కుమార్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 30తో మండల పరిషత్ అధ్యక్షుల పదవీకాలం ముగిసిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాలకు స్పెషల్ ఆఫీసర్లను కలెక్టర్ నియమించారని ఆయన తెలిపారు. అనంతరం విజయ్‌కుమార్‌ను ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కృష్ణ, సంతోశ్, మోహన్‌రావు, చేరాలు, రాజేశ్వర్‌రావు, నిఖిల్, మహేందర్, కుమారస్వామి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వెంకటేశ్వరపల్లెలో అక్రమంగా స్టోన్ డస్ట్‌ను తరలిస్తున్న ట్రాక్టర్‌కు సరైన పత్రాలు లేకపోవడంతో రూ.2100 జరిమానా విధించినట్లు విజయ్‌కుమార్ తెలిపారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

విద్యార్థులకు పురస్కారాల ప్రదానంలో వక్తలు


నగదు పురస్కారాలను అందిస్తున్న నిర్వాహకులు

దేవరుప్పుల, జూలై 5: విద్యార్థుల్లో చదువుకోవాలనే సంకల్పం ఉంటే పేదరికం అడ్డుకాదని, ఇందుకు దాతలు, సంస్థలు ప్రోత్సాహం అందిస్తాయని లయన్స్ క్లబ్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. మండలంలోని కోలుకొండ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం విష్ణు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 10వ తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన మర్రి అరవింద్ విద్యానిధితో మండలంలో ఎస్ఎస్‌సీలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10వేల నగదు పురస్కారాన్ని అందజేస్తారని తెలిపారు. రెండు, మూడో స్థానాల్లో నిలిచిన వారికి సన్మానంతోపాటు జ్ఞాపికలు అందజేస్తారని వివరించారు. మండల టాపర్‌గా నిలిచిన భూక్యా నవీన్‌కుమార్‌కు మర్రి అరవింద్ స్మారక విద్యానిధి చైర్మన్ మర్రి పట్టాభిరాంరెడ్డి, లయన్స్‌క్లబ్ గవర్నర్ చంద్రశేఖర ఆర్య నగదు పురస్కారం అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన బాషంపల్లి దీపికను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. లయన్స్‌క్లబ్ గవర్నర్లు ఉప్పల రమేశ్ శర్మ, సుధాకర్‌రెడ్డి, బాధ్యు లు కల్వల భాస్కర్‌రెడ్డి, బజ్జూరి వేణుగోపాల్, దేవరుప్పుల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఈదునూరి నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూత్కూరు అశోక్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల్‌రెడ్డి, సభ్యులు ఈదునూరి వీరారెడ్డి, పెద్దాపురం వెంకటేశ్వరశర్మ, గడ్డం సత్యనారాయణరెడ్డి, గోలి చిన ఉప్పల్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకన్న, హరీశ్, శోభారాణి, కిరణ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

- కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా


కలెక్టరేట్‌లో టాయిలెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

జనగామ, జూలై 5 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు అంతస్తుల్లో ప్రతి ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సెకండ్ ఫ్లోర్ పరిశుభ్రం గా ఉంచాలని, అధికారులు పరిశుభ్రతపై ప్రతిరోజు దృష్టి పెట్టాలన్నారు. డీఐఈవో ఆఫీస్‌కు ఎదురుగా నీటి నిల్వపై రోడ్లు భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని పరిశీలించి పాత పేపర్లను తీసివేయాలని, పనిచేయని సామగ్రిని స్టోర్ రూమ్‌కు తరలించాలని ఆయన ఆదేశించా రు. లిఫ్ట్ మరమ్మతుల కోసం సంబంధిత కంపెనీ వారికి సమాచారం పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏవో రవీందర్ ఉన్నారు.